జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 31-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 498 పేజీలు: 4 వెల : రూ.7





# కృష్ణ గాడు.. గజదొంగ

శ్రీకాకుళం

**క్రైం, అక్టోబరు 30 (వార్త):** దున్న కృష్ణకు.. దొంగతనం వెన్నతో పెట్టిన విద్య. పోలీసులు బందోబస్తుకు వెళ్లిన సమయాల్లోనే వీడు హస్తలాఘవం ప్రదర్శిస్తుంటాడు. వేషాలు మారుస్తూ జనం మధ్యలోనే ఉంటూ తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి రాత్రి వేళ దొంగతనం చేస్తుంటాడు. సీసీ కెమెరాలకు చిక్కకుండా చోరీలు చేయడంలో సిద్ధహస్తుడు. 1996 నుంచి నేటి వరకూ చోరీలు చేస్తున్న గజదొంగ. చాలాసార్లు పోలీసులకు పట్టుబడి ఆపై బెయిల్‌పై వచ్చి మరీ దొంగతనాలు చేస్తున్న ఘనుడు. దున్న కృష్ణపై మొత్తం 250పైనే కేసులు ఉన్నాయి. వీటిలో 195 కేసులకు శిక్ష కూడా పడింది. దున్న కృష్ణది మెళియాపుట్టి మండలం చాపర గ్రామం. 1996లో సైకిల్ దొంగతనంతో వీడి నేరాల చిట్టా ప్రారంభమైంది. శ్రీకాకుళం జిల్లాలోనే కృష్ణపై సుమారు 50 కేసులు ఉన్నాయి. మిగతావి ఇతర ప్రాంతాల్లో నమోదైనవే. నెలకో దొంగతనం చేస్తూ వచ్చిన డబ్బుతో విలాస జీవితం అనుభవిస్తుంటాడు. ఆ డబ్బు అయిపోయిన వెంటనే మళ్లీ దొంగతనం చేస్తుంటాడు. పట్టుబడితే జైలు.. లేకుంటే విలాసవంత జీవితం గడుపుతుంటాడు.. ఈ గజదొంగ దున్న కృష్ణ. వీడు మారువేషాలే కాకుండా మారు పేర్లతో తిరుగుతూ ఉంటాడు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీ, బ్యాంకర్స్ కాలనీ, తిలక్‌నగర్, ఏఎస్ఎన్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, సాయిబుల తోట, తదితరు ప్రాంతాల్లో కాస్ట్లీ కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాలే వీడి టార్గెట్. జిల్లాలో పెద్దపెద్ద దొంగతనాలు జరిగాయంటే వీడి హస్తం ఉంటుంది అని పోలీసులు అనుమానిస్తున్నారు. వీడు చేసే దొంగతనం పోలీసులకి సవాల్‌గానే మారుతుంది. విజయవాడ, రాజమండ్రి, విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లోనే వీడిపై ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఏకంగా ఓ కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం చేసి మరీ పోలీసులకు సవాల్ విసిరాడు. వీడు పాడుబడిన ఇళ్లల్లో, నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లల్లో తలదాటుకుంటూ రెక్కీ వేసి మరీ దొంగతనం చేసి పరారవుతుంటాడు. చోరీ చేసి వెళ్లేటప్పుడు సీసీ కెమెరాల కంటబడి మరీ తప్పించుకుంటుంటాడు. మారు వేషాల్లో తిరుగుతున్న జల్సారాయుడు వీడు. వీడిని గతంలో సీసీఎస్ పోలీసులు పట్టుకుని కటకటాల్లోకి నెట్టినప్పటికీ వీడి నేరప్రవృత్తి మారలేదు. 2005 సంవత్సరంలో అరసవిల్లి జంక్షన్ దగ్గర ఓ బార్‌లో సీసీఎస్ ఎస్ఐ తాతారావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఆ తర్వాత జైలుకు వెళ్లి మళ్లీ బయటకు వచ్చాడు. ప్రస్తుతం వీడి కోసం జిల్లాకు చెందిన ఐదు స్పెషల్ బృందాలు గాలిస్తున్నాయి. దున్న కృష్ణను పట్టించినా, సమాచారం అందించిన వారికి జిల్లా పోలీస్‌బాస్ లక్ష రూపాయలు నగదు బహుమతి కూడా ప్రకటించారు.



మోస్ట్ వాంటెడ్ క్రిమినల్

| | |
|---|---|
| పేరు | : దున్న క్రిష్ణ |
| మారుపేర్లు | : రాజు,ప్రీతమ్ కిషన్ సింగ్ |
| తండ్రిపేరు & తల్లిపేరు | : సింహాచలం & పాపాయమ్మ |
| వయస్సు | : 50 |
| లింగం | : పురుషుడు |
| కులం | : విశ్వబ్రాహ్మణ |
| భార్య | : ప్రమీల @ ప్రీతమ్ ప్రమీల |
| కుమార్తె | : రేణుక |
| శాశ్వత చిరునామ | : రెల్లి వీధి,చాపర గ్రామం, మెలియాపుట్టి మండలం, శ్రీకాకుళ జిల్లా |
| చివరిగి ఉన్న చిరునామా | : టూస్య స్ట్రీట్, నీసల్ మసీద్ ప్రక్కన,కలకత్తా,వెస్ట్ బెంగాల్ |
| ఎత్తు | : 5.6 |
| రంగు | : తెలుపు |
| మాట్లాడే భాషలు | : తెలుగు,ఇంగ్లీష్, హిందీ, బెంగాళ, ఒడియా, తమిళ్ |
| గుర్తులు | : కోల మొఖం, గెడ్డం |
| వస్త్ర దారణ | : ఫుల్ హ్యాండ్ టీ షర్ట్, ఆఫ్ హ్యాండ్ షర్ట్స్, ఫ్యాంట్స్, కాలేజ్ బ్యాగ్ |
| గాయాలు | : కుడి కాలు విరగడం వలన కొంచెం కుంటుతూ నడుస్తాడు |
| నేరాలు | : దొంగతనం. |
| పోలీస్ స్టేషన్ / కేస్ రిఫరెన్స్ నెం | : 2వ పట్టణపోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ శ్రీకాకుళం. |
| బహుమతి | : సమాచారం ఇచ్చిన వారికి విలువగల పారితోషికం ఇవ్వబడును |
| సంప్రదించవలసిన నెంబర్ | : ఎస్.పి.శ్రీకాకుళం-6309990800 |
| | అడిషనల్ ఎస్.పి. (క్రైమ్) - 6309990803 |
| | డి.ఎస్.పి. (శ్రీకాకుళం) - 6309990804 |
| | సి.ఐ. 2టౌన్, శ్రీకాకుళం : 6309990824 |
| | సి.ఐ.శ్రీకాకుళం రూరల్ సర్కిల్ : 6309990814 |
| | సి.ఐ.సి.సి.ఎస్ శ్రీకాకుళం : 6309990835 |
| | పోలీస్ కంట్రోల్ రూమ్ శ్రీకాకుళం : 6309990933 |

ఇట్లు
శ్రీకాకుళం జిల్లా పోలీస్

* పోలీసుల దృష్టిలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ * దున్న కృష్ణపై 250 కేసులు * 195 కేసుల్లో శిక్ష * కొట్టేసిన డబ్బుతో విలాసవంత జీవితం * పోలీసుల కన్నుగప్పి మరీ తప్పించుకుంటున్నాడు * పట్టించిన వారికి లక్ష రివార్డు ప్రకటించిన పోలీసులు



# రాత్రి వేళ నిఘా పెంచండి

* అనుమానితుల వివరాలు సేకరించండి * పాత నేరస్థుల కదలికలను గమనించాలి * కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ప్రాధాన్యం * పెండింగ్లో ఉన్న ప్రాపర్టీ కేసులపై దృష్టి సారించాలి * ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించండి * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, అక్టోబరు 30(వార్త):** రాత్రి వేళలో పకడ్బందీగా విధులు నిర్వర్తించి కొత్త, అనుమానిత వ్యక్తులు తారస పడితే వివరాలను ఆరా తీయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాల్లో సందర్శించి గ్రామస్థులతో మమేకమై శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల వివరాలను సేకరించి అలాంటి వారిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. పాత నేరస్థులు కదలికలపై దృష్టి కేంద్రీకరించి ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తులో నాణ్యత,వేగం ప్రాధాన్యతగా భావించి ప్రతి కేసు దశలవారీగా పర్యవేక్షించాలన్నారు. కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాలు కీలకమన్నారు. సాక్ష్యాలను శాస్త్రీయంగా సేకరించి,చార్జ్‌షీట్లు సమయానికి దాఖలు చేయాలన్నారు. కోర్టులో సరైన ఆధారాలు తో దర్యాప్తు పత్రాలు సిద్ధం చేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి వెంటనే విచారణ చేపట్టాలని సూచించారు. ప్రతి అధికారి తన పరిధిలో పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత కేసులు త్వరితగతిన విచారానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ నేరాలపై దృష్టి కేంద్రీకరించాలని, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసులు ఛేదించాలన్నారు. ఫిర్యాదులు పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సిహెచ్ వివేకానంద, లక్ష్మణరావు పరిపాలన అధికారి సి.హెచ్ గోపీనాథ్, సిఐ ఇమ్మానియల్ రాజు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మట్టి నమూనాల సేకరణపై అవగాహన

**మెళియాపుట్టి అక్టోబరు 30 (వార్త):** విద్యార్థులకు భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ తదితర వాటిపై అవగాహన కల్పించి, భూసార పరీక్షా కేంద్రంలో పరీక్ష చేయు విధానాన్ని ఆముదాలవలస వ్యవసాయ సంచాలకులు కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంపై మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా విద్యార్థులలోనున్న నైపుణ్యంతో రైతులకు అవగాహన కల్పిస్తూనే, భూసార పరీక్ష తుది జాబితా గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో అవగాహన, నైపుణ్యత కల్పించి వారి ద్వారా వారి తల్లిదండ్రులకు, అలాగే రైతులకు అవగాహన కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు భూసార వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లాలో ఏకలవ్య మోడల్ స్కూల్ మెళియాపుట్టి, జవహర్ నవోదయ సరుబుజ్జిలి కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం ఈ మూడు స్కూల్స్ ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు రవికుమార్, పద్మనాభం, సుజాత, లతాశ్రీ, ఏకలవ్య స్కూల్ అధ్యాపక సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారి ప్రభావతి, కృషి విజ్ఞాన కేంద్రం టెక్నీషియన్ కిషోర్, విద్యార్థులు తదితరులున్నారు.

* రక్తదానం ఒక మానవతా సేవ కార్యక్రమం
* పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి
* జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి
* జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం



# రక్తదాతలు.. ప్రాణదాతలు!

**శ్రీకాకుళం క్రైం, అక్టోబర్ 30 (వార్త):** రక్తదాతలు.. ప్రాణదాతలతో సమానమని, రక్తదానం కార్యక్రమం ఒక మానవతా సేవా కార్యక్రమమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా, శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఎస్పీతో సహా పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి, ఒత్తిడితో కూడుకున్నవన్నారు. ప్రతి సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అత్యవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తదానం చేసి సమాజంలో సేవా స్ఫూర్తిని నిలబెట్టాలని కోరారు. మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య బృందం ద్వారా రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్, జిల్లా ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి రెడ్ క్రాస్ వారి ప్రశంస, పతకాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ,పి శ్రీనివాసరావు డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి,రెడ్ క్రాస్ ఛైర్మెన్ జగన్మోహన్, పోలీసు యూనిట్ డాక్టర్ పోలీసు యూనిట్ డాక్టర్ సి హెచ్ విజయ కుమార్, పలువురు వైద్యులు,పోలీసు అధికారులు, సిబ్బంది,మహిళ పోలీసులు, హోంగార్డులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.








### హెచ్‌సీ కుటుంబానికి కోటి మంజూరు

శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ పి.జగదీష్ రావు గత జూన్ నెలల్లో టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించారు. ఆయన కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద కల్పించిన వ్యక్తిగత ప్రమాద బీమా మేరకు ఒక కోటి రూపాయలు మంజూరు చేశారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఈ నగదు చెక్కును కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాలరీ ప్యాకేజీ ద్వారా లభించే లబ్ధిని జిల్లా పోలీసులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబాలకు ప్రమాద,అత్యవసర సమయాల్లో భరోసా కలిగించే విధంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఖాతాలను ఈ పోలీసు శాలరీ ప్యాకేజీ నకు అనుసంధానం చేసుకోవాలన్నారు.





## యూపీలో రోడ్డు ప్రమాదం

* 16 మంది జిల్లా వాసులకు గాయాలు
* కాశీ నుంచి అయోధ్య వెళ్తుండగా ఘటన
* ఫోన్‌లో పరామర్శించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**పలాస, అక్టోబరు 30 (వార్త):** ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాన్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మంది గాయపడ్డారు. బ్రాహ్మణతర్ల, కోటబొమ్మాళి, పాతపట్నం, బూర్జ, తిమడాం తదితర ప్రాంతాల నుంచి 80 మంది ఈ నెల 19న యాత్రకు వెళ్లారు. గురువారం కాశీ నుంచి అయోధ్య వెళుతుండగా వీరి వాహనాన్ని ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బ్రాహ్మణతర్లకు చెందిన పట్నాన వజ్రంమూర్తి, ఆయన భార్య రమాదేవితో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మిగతావారికి చిన్నచిన్న గాయాలయ్యాయి. క్షతగాత్రులను జాన్‌పూర్ సిటీ ఆసుపత్రికి తరలించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ బాధితులను ఫోన్‌లో పరామర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎం మృతి

**కొత్తూరు, అక్టోబరు30 (వార్త):** కొత్తూరు మండల పరిధిలో గురువారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక మహిళా ఆరోగ్య కార్యకర్త మృతి చెందింది. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం ప్రకారం, ఒడిశా రాష్ట్రం కాశీనగర్ ప్రాంతానికి చెందిన మాలతీ బాయి (48) కొత్తూరు మండలంలోని కడుము సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఆమె, మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి సంభవించింది. ఘటన గురించి సమాచారం అందుకున్న కొత్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ప్రమాద స్థలాన్ని కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్య అధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. మాలతీ బాయి మృతి పట్ల సహోద్యోగులు, స్థానికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి ఇంత దుర్ఘటనకు గురవడం పట్ల అందరూ విచారం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఎస్‌ఐ అప్పన్న ఆకస్మిక మృతి

**మెళియాపుట్టి, అక్టోబరు30 (వార్త):** మెళియాపుట్టి పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న బగాది అప్పన్న గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం ఒరిస్సా రాష్ట్ర మంత్రి పర్యటనకు రావడంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన మెళియాపుట్టిలో మధ్యాహ్నం వరకు ఏఎస్‌ఐ అప్పన్న విధులు నిర్వహించారు. అనంతరం చాపరలో నివాసం ఉంటున్న ఆయన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే వారి కుటుంబ సభ్యులు శ్రీకాకుళం వెళ్ళడంతో ఏఎస్‌ఐ అప్పన్న ఒక్కరే ఇంట్లో ఉన్న సమయంలో అస్వస్థతకు గురయ్యారు. తోటి సిబ్బంది ఫోన్ చేసిన సమయానికి ఏఎస్‌ఐ అప్పన్న సరిగ్గా మాట్లాడలేకపోవడాన్ని గమనించి ఏఎస్‌ఐ రమణ వైద్యుడిని తీసుకువచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో చాపర పీహెచ్‌సీకి, మెరుగైన వైద్యం కోసం ఆ తర్వాత టెక్కలి ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందారు. మృతుడు అప్పన్న స్వగ్రామం ఎచ్చెర్ల, ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## తుఫాన్ పంట నష్టం సక్రమంగా అంచనా వేయాలి

**మందస, అక్టోబరు30 (వార్త):** మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టం అంచనా సక్రమంగా వేయాలని పలాస ఎంఎల్‌ఎ గౌతు శిరీషా ఆదేశించారు. మందస మండలంలోని చీపి, వీరగున్నమ్మపురం, కుంటికోట తదితర పంచాయితీలలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులతో మాట్లాడుతూ రైతుల జాబితాను త్వరగా సిద్ధం చేయాలన్నారు. అన్ని గ్రామాలలో పర్యటించి, పంట నష్టాన్ని సక్రమంగా అంచనా వేసి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు మండేలా రామారావు, మందస వ్యవసాయాధికారి గొజ్జ నాగరాజు, సిబ్బంది, తెలుగుదేశం, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి

**కొత్తూరు, అక్టోబరు30 (వార్త):** ముంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరు మండలం కర్లెమ్మ రెవెన్యూ గ్రామంలో గురువారం సిపిఎం కమిటీ సభ్యులు పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను కలుసుకుని వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావం కారణంగా వరి, పత్తి, అరటి, మొక్కజొన్న, మినుము, కూరగాయ పంటలు వంటి అనేక పంటలు దెబ్బతిన్నాయని, రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో నష్టపోయారని తెలిపారు.అన్ని పంటలకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఎన్యూమరేషన్ చేపట్టి, అర్హులైన రైతులు మరియు కౌలు రైతులను గుర్తించి తక్షణమే పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదనంగా, రంగు మారిన ధాన్యం, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను కూడా మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయడానికి నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం నాయకులు పనస రమేష్, వైకుంఠరావు, ధర్మారావు, వెంకట్రావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## తేలని చాపరాయికాలనీ భూసమస్య

* ఇరువర్గాలలో నిరాశ
* మళ్లీ వాయిదా పడిన వివాదం

**మందస, అక్టోబరు 30(వార్త):** చాపరాయికాలనీ భూసమస్య మళ్లీ చాప వేసుకుని కూర్చొంది.. సమస్యను తేల్చనంటోంది.. ఇటు గిరిజనులు, అటు గిరిజనేతరుల మధ్య భూ సమస్య నలిగిపోతోంది. అధికారులకు కూడా సమస్య పరిష్కారం ఎలా చేయాలో బోధపడడంలేదు. ఇరువర్గాలు పట్టుబట్టడంతో సమస్యకు మోక్షం కలగడంలేదు. మందస మండలంలోని కొండలోగాం పంచాయతీలో చాపరాయి కాలనీలో గల కొన్ని భూములకు సంబంధించిన వివాదాలు గిరిజనులు, గిరిజనేతరుల మధ్య కొనసాగుతున్నాయి. భూములు మావి అంటే.. మావి అంటూ.. ఇరువర్గాలు పత్రాలను చూపుతున్నారు. వివాదం పరిష్కారానికి మార్గంలేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నకళ్లు తెప్పించి, సమస్యను పరిష్కరించడానికి తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. ఈ నెల 30న సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ ఇరువర్గాలకు చెప్పడంతో వారంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కానీ, మళ్లీ నిరాశే ఎదురైంది. సమస్యకు పరిష్కారం లభించలేదు. గిరిజనులు, గిరిజనేతులు చూపిస్తున్న పత్రాలపై తహసీల్దార్ వివాదాన్ని ఎటూ తేల్చలేకపోయారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ను మళ్లీ ఆశ్రయించారు. నవంబరు 5వ తేదీకి సమస్యను వాయిదా వేస్తూ.. తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ నిర్ణయం తీసుకున్నారు. కాగా, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు, ప్రజా సంఘాలు వినతిపత్రాన్ని తహసీల్దార్ కు అందజేశాయి. గిరిజనేతరులైన కరగాన సుదర్శన్, న్యాయవాది సనపల అశోక్ లు మాత్రం తమ వద్ద ఉన్న పత్రాలతో న్యాయం జరుగుతుందని చెబుతున్నారు. నవంబరు 5న సమస్య పరిష్కారం దొరుకుందని ఉభయులు భావిస్తున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రీ సర్వే పై రెవెన్యూ కమిషనర్ కు ఫిర్యాదు

కంచిలి, **అక్టోబరు 30(వార్త):** కంచిలి మండలం కత్తివరం రెవెన్యూ పరిధిలో గతంలో జరిగిన రీ సర్వేలో అనేక తప్పులు జరిగాయని వాటిని సరిచేయాలని స్థానిక అధికారులను అనేకమార్లు కోరినప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగడం లేదని రాష్ట్ర రెవెన్యూ కమిషనర్ కు విజయవాడలో గురువారం మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు, హరిబాబు ఫిర్యాదు చేశారు. ఇటువంటి సమస్యల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. సబ్బవరం సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.




## నేడు మాజీ ఎంపీపీ సీర వర్ధంతి



**మందస, అక్టోబరు 30(వార్త):** మాజీ ఎంపీపీ స్వర్గీయ సీర నాగేశ్వరరావు 13వ వర్ధంతి ఆయన స్వడిమిరియా గ్రామంలో శుక్రవారం నిర్వహించను న్నట్టు తెలుగుదేశం పార్టీ మందస మండల నాయకులు చెప్పారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పలాస ఎంఎల్ఎ గౌతు శిరీషా హాజరవుతారన్నారు. ఎంతో అంకితభావం కలిగిన సీర నాగేశ్వరరావుకు నివాళులర్పించడా నికి తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**వీరఘట్టం, అక్టోబరు 30(వార్త):** వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో ఈనెల 31వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ) కె. విష్ణుమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారంనాడు 11కేవీ కడకెల్ల ఫీడెర్ నందు ట్రాన్స్ఫార్మర్ నిర్వహణ తో పాటు చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందన్నారు. నడుకూరు, కిమ్మి, విక్రమపురం, చిట్టిపులివలస, నడమికెల్ల, కడకెల్ల, కంబర, కంబరవలస గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## చట్టాలపై ప్రజలు అవగాహనతో మెలగాలి



**వీరఘట్టం, అక్టోబరు 30(వార్త):** ప్రజలకు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై జి.కళాధర్ అన్నారు. గురువారం చిట్టపులివలస గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క పౌరుడు చట్టాలను గౌరవించాలని, చట్టాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని దీనిపై ప్రజలు అవగాహనతో మెలగి అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తుల నుండి ఓటీపీలు చెప్పమని వచ్చిన లేదా ఏదో మభ్యపెట్టి మీ వివరాలను రాబెట్టడానికి ప్రయత్నించి తక్షణమే గ్రహించి తిరస్కరించాలన్నారు. ఎవరికైనా అనుమానం వస్తే తక్షణమే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజలు, యువత పాల్గొన్నారు

## వైద్యుని ఔదార్యం..!

**-విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ**

**వీరఘట్టం, అక్టోబరు 30(వార్త):** సేవ చేయాలనే దృక్పథం ఉండాలే కాని అది ఏ రూపంలో అయినా చేయొచ్చు .గిరిజన విద్యార్థులకు వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు వీరఘట్టంకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ భోగి సంపత్ కుమార్ .గురువారం మండలంలోని చినగోర మోడల్ ప్రైమరీ పాఠశాల లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వేడి నీరు తాగాలనే ఉద్దేశంతో వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 52 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థుల పట్ల డాక్టర్ సంపత్ కుమార్‌కు ఉన్న ఔదార్యాన్ని మెచ్చుకుంటూ గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కార్గో ఎయిర్‌పోర్ట్‌ను విరమించుకోవాలి

### - వామపక్ష నేతల డిమాండ్



**పలాస, అక్టోబరు 30(వార్త):** కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ నవంబర్ 18 వ తేదీన పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది. పలాస లో ఉన్న కళ్యాణమండపంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కొమర వాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు మాట్లాడుతూ కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చడమే అభివృద్ధా? అని కేంద్ర పౌర విమానాయా శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. తుఫాన్ లో ప్రజలు బిక్కుబిక్కుమని బతుకుతుండగా మరోవైపున ప్రభుత్వ యంత్రాంగం రహస్యంగా సర్వేల కోసం గ్రామాలకు రావడాన్ని తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళం జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయలేని, అప్ షోర్ రిజర్వాయర్ పూర్తి చెయ్యలేని, జిల్లా కేంద్రంలో ఉన్న కోడి రామకృష్ణ ఇండోర్ స్టేడియం కోసం కనీసం 6 కోట్లు తెచ్చుకోలేని వాళ్ళు, జిల్లాలో రోడ్లు బాగు చేయలేని, వాళ్ళు కిడ్నీ వ్యాధితో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోలేకపోయిన వాళ్లు, ఈరోజు జిల్లా అభివృద్ధి కోసం మాట్లాడ్డం హాస్యస్పదంగా ఉందని ఏద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని వాగ్దానం ఇచ్చి ఒక్క వాగ్దానం కూడా అమలు చేయలేని వారు ఉద్యోగాలు ఇస్తాము అభివృద్ధి ఇస్తామని, చెప్పి ప్రజలకు మోసం చేయడానికి పూనుకోవడం కాదా అని మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లు నరికేయడం వల్ల పర్యావరణపరంగా శ్రీకాకుళం జిల్లాకి పెనుముప్పు ఏర్పడదా అని ప్రశ్నించారు. జీడి ఆధార పరిశ్రమలు అభివృద్ధి చేస్తే వాటి వలన సుమారు ప్రత్యక్షంగా,పరోక్షంగా 40,000 మందికి ఉపాధి దొరుకుతుందని వారు అన్నారు. దేశంలో ఎక్కడైనా ప్రత్యేకంగా కార్గో ఏర్పోర్ట్ ఉన్నదా అని కేంద్ర మంత్రిని వారు ప్రశ్నించారు. కార్గో ఎయిర్పోర్టుకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వినర్ టి అజయ్ కుమార్,ప్రజా సంఘాల నాయకులు మద్దిలి రామారావు,యన్ గణపతి,కె శ్రీనివాస్, యం రామారావు, పి దుర్యోధన, కె బాలజీ రావు, టి భాస్కరరావు,జి బాలకృష్ణ, పి కుసుమ ,పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణరావు,లండ రామస్వామి, గుంటు లోకనాదం, సుంకర రాజు, జోగి శ్రీదేవి, బర్రి వినోద్, బర్రి జయలక్ష్మి, కొమర తేజ, నల్ల పరశురామ్, బడే సాంబమూర్తి, గుంటు రామస్వామి పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణ అందరికీ అవసరం



**పలాస, అక్టోబరు 30(వార్త):** ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరిరక్షణ అవసరమని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో మునిసిపల్ చైర్మన్ మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ క్యాంపు డ్వాక్రా మహిళలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏదైనా సాధించగలమని చెప్పారు. పలాస మున్సిపాలిటీలో ఉన్న సెల్ఫీ హెల్ప్ గ్రూప్ అందరికీ ఈ మెడికల్ టెస్టులు చేస్తూ ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. సంపూర్ణమైన ఫిట్నెస్ కావాలంటే ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. మెప్మా సిబ్బంది విధి నిర్వహణలో వెనకంజవేయకుండా విధులు నిర్వహించి అధికారుల తోడుగా ఉండాలని కోరారు. మెప్మా సిబ్బంది అందరు ఈ మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అంగీకార్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరంను పలాస మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 500 మంది రోగుల హాజరైనారు. వారికి వివిధరకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్ రకరకాల పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సవర సోమేశ్, సీట్టీసీ మల్లేశ్వరరావు, జగన్, మెప్మా సీఎంఎం మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం..

# సద్వినియోగం చేసుకోవాలి

**పలాస, అక్టోబరు 30(వార్త):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. అంగీకార్ – 2025 ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళా సంఘ సభ్యులతో కమిషనర్ అధ్యక్షతన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా వివిధ కారణాల వలన 2025 సంవత్సరం వరకు గృహ నిర్మాణాలు ఆగిపోయిన లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తి చేయాలని, దేశంలో ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ స్పెషలిస్ట్ సిహెచ్ మల్లేశ్వరరావు, సి ఎం ఎం మోహన్, ఆర్పీలు, మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ ఉదారత




**మందస, అక్టోబరు 30(వార్త):** విధి నిర్వహణలోనే కాదు.. సమాజానికి కూడా సేవ చేస్తున్నారు మందస పోలీసులు. ఇటీవల మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పలు సేవా కార్యక్ర మాలు చేయగా.. ఆయన దారి లోనే కానిస్టేబుల్ కె.ఢిల్లేశ్వరరావు నడుస్తున్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఢిల్వేశరరావు రక్తదానం చేశారు. రక్తదానం ఎందరి ప్రాణాలనో కాపాడుతుందని, ప్రతీ ఒక్కరూ రక్తదానం, అవయవదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లేశ్వరరావును స్టేషన్ సిబ్బంది, స్థానికులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరి ఎంపిక



**ఇచ్ఛాపురం, అక్టోబరు30(వార్త):** స్థానిక సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వండో పోటీలకు ఎంపికయ్యారు. ఆశి.రేవంత్ రెడ్డి, తిప్పన.జీవన్ రెడ్డిలు ఎంపికయ్యారు. హెచ్ఎం కే.సూర్యం, ఆశి గౌరీశంకర రెడ్డి, జయలక్ష్మి, సూర్యం, గణేష్, జోగేష్, రంగారావు కామరాజు, శారద, ప్రసాద్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## చినబాబు మృతిపై సంతాపం

**ఇచ్ఛాపురం, అక్టోబరు30(వార్త):** వైస్సార్సీపీ నాయకులు ఉప్పాడ చినబాబు రెడ్డి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. గురువారం ఆయన అంత్యక్రియల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తుఫాన్ల నుంచి పంటలను పరిరక్షించుకోవాలి

**కోటబొమ్మాళి, అక్టోబరు 30(వార్త):** గట్లపాడులో సాగు చేస్తున్న టమాట, కాలీఫ్లవర్, బెండ మొదలగు కూరగాయల పంటలను ఆమదాలవలస ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ రాజశేఖర్, ఉద్యాన శాఖ అధికారిణి కే.సునీత గురువారం పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కూరగాయల పంటలు నాశనం అవ్వకుండా ఉండాలంటే 19.19.19 లేదా మల్టీకే 5 గ్రామాలు చొప్పున లైట్ యూరియా వేసి పిచికారి చేయాలని సూచించారు. కుళ్ళు తెగులు ముందు జాగ్రత్తగా సాఫ్ పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యాన విస్తరణ అధికారిని ఆమని, వ్యవసాయ విస్తరణ అధికారి మధుకిరణ్ పాల్గొన్నారు.



# ప్రచార్భాటం తప్ప..ప్రజలకు చేసింది శూన్యం!

-ధర్మాన కృష్ణచైతన్య

**జలుమూరు, అక్టోబరు 30(వార్త):** గంగాధరపేట గ్రామంలో జోనంకి-సుబ్రమణ్యపురం-వెంకటాపురం క్లస్టర్ పరిధిలో నిర్వహించిన రచ్చబండ (కార్యకర్తలతో కృష్ణచైతన్య) కార్యక్రమంలో యువ నాయకుడు డా. ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి పాలనలో ప్రజలకు ప్రయోజనం చేకూరిందేమీ లేదని, ప్రచారార్భాటం తప్ప ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా పథకాలను కాపీ కొట్టి చంద్రబాబు తన పాలనలో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే చిత్తూరు నుండి నరసన్నపేట వరకు కల్తీ మద్యం తయారీ యూనిట్లు నడుపుతూ ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చుతున్నారని తీవ్రంగా విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజలకు నిజాలను తెలియజేయాలని ఆయన సూచించారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల మెచ్చిన పాలన త్వరలోనే తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉపాధ్యక్షులు బగ్గు రామకృష్ణ, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, బీసీ సెల్ అధ్యక్షులు పొన్నాడ విజయ్



కుమార్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి



**పలాస, అక్టోబరు 30(వార్త):** విద్యార్థి దశ నుంచే చాట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్సై ఎన్ నరసింహమూర్తి అన్నారు. కాశిబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం పోలీస్ అమర వీరుల స్మారక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ సిఐ పి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో సాయి శిరీష జూనియర్ కాలేజ్ నుంచి 70 మంది విద్యార్థిని విద్యార్థులు పిలిపించి వారికి ఓపెన్ హౌస్ ప్రోగ్రామ్, పోలీస్ స్టేషన్ పని చేసే విధానం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వివరిస్తూ పోలీసుల పనితీరుపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, చట్టాలు అంటే ఏమిటో తెలుసుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో మంచి పోలీసు అధికారులుగా తయారు కావాలంటే మీకు చట్టాలపై అవగాహన ఎంతైనా అవసరం ఉందని చెప్పారు. వివరిస్తూ విధి నిర్వహణలో చట్టాలకు లోబడి పని చేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పని చేయవలసి ఉంటుందని చెప్పారు. అనంతరం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద పోలీసువారిచే పోలీస్ బ్యాండు ఏర్పాటు చేయగా ప్రజల ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమములో ఎఎస్ఐలు గణపతి రావు, సంజీవరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీల ధ్వంసంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**వీరఘట్టం, అక్టోబరు 30(వార్త):** వీరఘట్టంలో ఇటీవల ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారంటూ మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో కూటమి నేతలు ఫిర్యాదు చేశారు . అందరి అభిమాన నాయకులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కు పలు రకాలుగా అభినందనలు తెలుపుతూ ఆయన అభిమానులు పలు ఫ్లెక్సీలను కట్టి ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే కొందరు వ్యక్తులు వీటిని కావాలనే ధ్వంసం చేస్తున్నారంటూ కూటమి నేతలు మండిపడుతున్నారు. గత నెల రోజులుగా ఫ్లెక్సీలను ఎవరెవరు ధ్వంసం చేస్తున్నారు సీసీ ఫుటేజ్ లు ఆధారంగా కూటమినేతలు ఎస్సై జి. కళాధర్‌కు వివరించారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం అయితే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు ముక్తకంఠంతో కోరారు. ఎస్సైకు ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమామహేశ్వరరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొర్లె గౌరునాయుడు, నీటి సంఘం అధ్యక్షులు వెలగాడ శ్రీనివాసరావు, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు పారిశెర్ల వెంకటరమణ, జనసేన జానీ, జంపు శేఖర్, జనసేన నేతలు సరిపల్లి అచ్యుతరావు,



కర్నేని సాయి తదితరులు ఉన్నారు.

**రెచ్చిపోతే తాటతీస్తా... ఎస్సై హెచ్చరిక..**

ఫ్లెక్సీల ధ్వంసం చేసిన వారిని ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, రెచ్చిపోతే వారి తాటతీస్తానని ఎస్సై జి .కళాధర్ హెచ్చరించారు. ఇప్పటికే దీనిపై దర్యాప్తును వేగవంతం చేశామని సీసీ కెమెరాల ఆధారంతోనే కాకుండా ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంటుందన్న అనుమానాలు ఉన్న వారిపై కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెబుతూ, భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని ఆయన అన్నారు. గంజాయి ,నాటుసారా వలన యువత చెడు మార్గంలో పయనిస్తుందని దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నామని ఇందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని కూటమి నాయకులకు ఎస్సై భరోసా ఇచ్చారు.

# పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 30(వార్త):** ఇచ్ఛాపురం మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 10 వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకొరకు జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు విశాఖపట్నం సౌజన్యంతో విద్యార్థులకు 1279 స్టడీ మెటీరియల్ పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి అందించారు. మండలంలోని ప్రభుత్వ బడుల్లో పదవతరగతి విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందిస్తామని ఇరువురు మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు మరియు ఎస్ విశ్వనాథం లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యా తోడ్పాటు అందిస్తున్న జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు విశాఖపట్నం కి ఇరువురు మండల విద్యాశాఖాధికారులు అభినందనలు తెలియజేశారు. ఈ స్టడీ మెటీరియల్ని ఉన్నత పాఠశాలలకు అందించి తద్వారా విద్యార్థులకు అందిస్తామని ఎంఇఓ లు తెలిపారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు ఈ ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిలో ఉన్న సారాంశాన్ని విద్యార్థులు అభ్యసన%శీ% చేసి మంచి ఫలితాలు సాధించాలని ఎంఇఓలు తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కామేష్, రవి , దేవరాజు, గణేష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర పోటీలకు టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



**పలాస, అక్టోబరు 30(వార్త):** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం శ్రీకాకుళం జిల్లా టెన్నికాయిట్ 18 సంవత్సరాల లోపు బాల బాలికల ఎంపికలు నిర్వహించారు. బాలురు జట్టులో బి.సిద్ధార్థ, బి. ఉదయ్ కిరణ్, కె ప్రవీణ్ కుమార్, టి. వెంకటేష్ , స్టాండ్ బైగా కె.జస్వంత్. బాలికల జట్టులో పి. శ్రావణి పాత్రో, ఎన్. దివ్య, వై. వరలక్ష్మి, బి. నందిని ఎంపికయ్యారని, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. తవిటయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్ కుమార్, పాఠశాల సిబ్బంది కార్యదర్శి పి.కృష్ణారావు, ఉపాధ్యాయులు చక్రపాణి ప్రధానో, ఏ.ఆనందరావు, వెంకటరమణ వ్యాయామ ఉపాధ్యాయులు బి. శంకర్రావు, ఆర్.శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా బి.తిరుమల, ఎం.దామోదర్ వ్యవహరించారు.

## బోరుకు మరమ్మతులు.. ధన్యవాదాలు



**పలాస, అక్టోబరు 30(వార్త):** తిలక్ నగర్ లో ఎంతో మందికి దాహార్తిని తీర్చిన పవర్ బోర్ మరామత్తుకు గురి అయన వెంటనే కొత్త మోటారుతో పాటు ఇతర కొత్త పరికరాలు వేసి బాగుచేయడం పట్ల కాశిబుగ్గ తిలక్ నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు, వీధివాసులు స్థానిక కౌన్సిలర్ అయిన దువ్వాడ శ్రీకాంత్ కు ప్రత్యేక ధన్యవాదాలు అని గురువారం తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబుకి, దువ్వాడ శ్రీకాంత్ కి, మున్సిపల్ కమీషనర్ నడిపేన రామారావుకిమున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు, సిబ్బందికి ధన్యవాదములు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమలో పాల్గున్న వార్డ్ పెద్దలందరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



**పలాస, అక్టోబరు 30(వార్త):** పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పలాస శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'విజిలెన్స్- మనందరి సంయుక్త బాధ్యత' అనే అంశంపై జరిగిన ఈ పోటీలలో నలుగురు విజేతలకు త్వరలోనే బహుమతులను అందజేయనున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ వివిఎన్ఆర్ కేఎన్ శెట్టి, జూనియర్ ఇంజనీర్లు కే.రఘుపతిరావు, ఈ. అప్పలనాయుడు, అధ్యాపకులు, మధురచరిత్రకారుడు కొండల మధుబాబు, బి.ప్రసాదరావు, ఎస్. యుగంధర్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూరిల్లు నేలమట్టం

**ఇచ్ఛాపురం, అక్టోబరు30(వార్త):** మెంథ తుఫాను ప్రభావంతో మండలంలో పలు పూరిల్లు నేలమట్టం అయ్యావి. ఈదుపురం మెయిన్ రోడ్డు లో బిందా బేహారా,ట్రంకు బేహారా ఇల్లు కు నష్టం వాటిల్లింది. త్రినాథ్ వీధి అంకుల బైది బేహారాల ఇల్లు ద్వంసం అయ్యాయి. ఈదుపురం లో హంగీర్ బేహారా యూత్ శ్రమదానం తో జంగిల్ క్లీరెన్స్ పనులు చేపట్టారు.కొఠారి, పత్రి పుట్టుగ లో రెండు ఇల్లు కి నష్టం వాటిల్లిందని సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, నర్తు నరేంద్ర యాదవ్ లు తెలిపారు.బహుదా నదిలో గురువారం ఉదయం నాటికి 23 వేల క్యూ సెక్కు ల నీరు తగ్గుముఖం పట్టినట్లు తహశీల్దార్ వెంకట రావు చెప్పారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



**పలాస, అక్టోబరు 30(వార్త):** కంబిరిగాం సమీపంలోని వరహాల గెడ్డలో బుధవారం గల్లంతైన సవర లావణ్ (లవన్న) మృత దేహం లభ్యమైంది. దానగోర గ్రామానికి చెందిన సవర లావణ్ (లవన్న) పోలయ్య, పలాస నుంచి కంబిరిగాంకు వెవరహాలగెడ్డ కాజ్ వే దాటుతుండగా ఈఘటన చోటుచేసుకుంది. వరద ఉధృతికి గెడ్డలో లావణ్ కొట్టుకు పోయినట్టు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు, పలాస తహశీల్దార్, రెవెన్యూ అధికారుల బృందం ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో సవర లావణ్ (లవన్న) కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం బ్రాహ్మణతర్ల సమీపంలో ఉన్న నదిలోని గల్లంతైన సవర లావణ్ (లవన్న) మృతదేహంన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

## ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం



**జలుమూరు, అక్టోబరు 30(వార్త):** జలుమూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి మాధవరావు ప్రసాద్ రావు, ప్రధానోపాధ్యాయులతో పలు విషయాలను చర్చించారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న విద్యా విధానాలపై మాట్లాడారు.

## ఘనంగా బగ్గు అర్చన జన్మదిన వేడుకలు



**పోలాకి, అక్టోబరు 30(వార్త):** కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కుమార్తె నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్లడ్ డొనేషన్ ,నరసన్నపేట ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణీ, గొట్టిపల్లి దగ్గర ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధితులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అర్చనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటానని పార్టీని కట్టుబడి ఉంటానని, నాన్న అడుగుజాడల్లో నడుచుకుంటానని తెలిపారు.

## సువర్ణాపురంలో పేద కుటుంబానికి ఆర్థిక సాయం




**మందస, అక్టోబరు 30(వార్త):** సువర్ణాపురం ఎస్సీ వీధికి చెందిన జారు కామేష్ తల్లి అనారోగ్యంతో బాధ పడుతుండగా.. సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు ఆర్థిక సాయం చేశారు. తొమ్మిది వేల రూపాయలను ఆ కుటుంబానికి అందజేశారు. పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు పాతపట్నం ఎంఎల్ఎ మామిడి గోవిందరావును మర్యాదపూర్వకంగా కలిసారు. సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయని ఎంఎల్ఎ గోవిందరావు అన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు తారక్, సాయి, తిరుపతిరావు, సాయి, విష్ పాల్గొన్నారు.

## గిరిజనులకు సాగు పట్టాలివ్వండి

**మందస, అక్టోబరు 30(వార్త):** కొండలోగాం రెవెన్యూ పరిధిలో చాపరాయి కాలనీలో గల గిరిజనలకు, గిరిజనేతరలకు మద్య గల భూ వివాదం రోజురోజుకి తీవ్రతరం కావస్తుంది. సమగ్ర సర్వే చేసి సాగు బడిలో ఉన్న గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ కు వినతి పత్రాన్ని వామపక్ష, ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు, రైతు సంఘాల నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తామాడ సన్యాసిరావు, కోనేరు రమేష్, మద్దిల రామారావు, సవర నర్శింహులు, సవర మాధవరావు, జయరాజ్, సావిత్రి పాల్గొన్నారు.



## వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే



**పలాస, అక్టోబరు 30(వార్త):** పలాస నియోజకవర్గం లోని వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన జరిపారు. బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పట్టణ లోతట్టు ప్రాంతంలోని వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్నంలోని ఆయా వార్డుల్లో కాలువలు కల్వర్టులు పునర్నిర్మాణానికి ఒక ప్రణాళికను రూపొందించమని, దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తామన్నారు. దశల వారీగా నైనా సరే ఆయా డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బారావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, లోడగల కామేశ్వరరావు, పిరుకట్ల విఠల్రావు, పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ సంతోష్ కుమార్, బూర్ల కృష్ణంరాజు, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించాలి



**జలుమూరు, అక్టోబరు 30(వార్త):** జిల్లాలో మోంథా తుఫాన్ ప్రభావం తో నీట మునిగిన పంటలను అధికారులు గుర్తించి వాటికి వెంటనే నష్టపరిహారం అందించాలని కృష్ణచైతన్య కోరారు, తుఫాన్ కారణంగా జలుమూరు మండలం రాయిపాడు గ్రామంలో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు, జగనన్న ప్రభుత్వంలో పంటకు ఉచిత భీమా ఉండేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత భీమా తొలగించారని అన్నారు,అన్ని విధాలుగా రైతులకు మోసం చేశారని మండిపడ్డారు. తక్షణమే పరిహారం చెల్లించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉప అధ్యక్షులు బగ్గు రామక్రిష్ణ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు దామ మన్మధరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు పైడి విటల్ రావు మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు బోర సింహాచలం, కన్నయ్య, అప్పన్న తదితరులు పాల్గొన్నారు,

## బీఎస్ పురం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన శిరీష



**మందస, అక్టోబరు 30(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం సచివాలయాన్ని పలాస ఎంఎల్ఎ గౌతు శిరీషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధి నిర్వహణపై ఫిర్యాదులు ఉన్నట్టు చెబుతున్నారు. దీంతోనే ఎంఎల్ఎ శిరీషా సచివాలయాన్ని పరిశీలించి.. ఉద్యోగుల వివరాలను తెలుసుకున్నారు. సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఆరోపణలు, ఫిర్యాదుల్లేకుండా పని చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, పార్టీ నాయకులు పీరికట్ల విఠల్ రావు, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, డుంకురు తిరుపతి, రాజాన మహేష్, తమ్మినేని ధనుంజయ, ముడిమించి నవీన్ కుమార్ యాదవ్, పోలాకి భాస్కరరావు, కడమట పూర్ణయ్య, గౌరకల చిన్నయ్య, గార కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయాధికారుల పర్యటన



**మందస, అక్టోబరు 30(వార్త):** మొంథా తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన ప్రాంతాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. పలాస వ్యవసాయ సంచాలకుడు మండేలా రామారావు, మందస వ్యవసాయాధికారి గొజ్జ నాగరాజు కొత్తకమలాపురం, పాతకమలాపురం, బాలిగాం, కుంటికోట తదితరుల గ్రామాల్లో పర్యటించారు. తుఫాను కారణంగా నష్టపోయిన పంటలను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా రైతులు మాట్లాడుతూ పంటలకు జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రభుత్వానికి తెలియజేసి, నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం వ్యవసాయాధికారులు మాట్లాడుతూ పడిపోయిన వరిపంటకు 5గ్రాముల ఉప్పునకు ఒక లీటరు నీటికి కలిపి, పిచికారిణి చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు పుష్యా ఉదయ్కుమార్, కొండల జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546